క్లుప్తంగా

మంత్రి బొత్సకు డైరీ, క్యాలెండర్ అందజేత



మంత్రి బొత్సకు డైరీ, క్యాలెండర్ అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్లు జమలపూర్ణమ్మ, మధుబాల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్లు జమల పూర్ణమ్మ, మధుబాల మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి బొత్సకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రంథాలయ సంస్థ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని అందజేశారు.

బధిర ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా బధిర, విభిన్నప్రతిభావంతుల ఉద్యోగుల సంఘం రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ ఆవిష్కరించారు. గాంధీనగర్ ఎన్జీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బధిర, విభిన్న ప్రతిభావంతులైన ఉద్యోగులు మొక్కవోని ధైర్యంతో విధులను నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. బధిర ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బధిర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు వై.శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.పాండురంగారావు, సహ అధ్యక్షులు బి.లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యక్షుడు డి.శివకుమార్, సెక్రటరీ టి.టి.దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీ షేక్ ముస్తఫా, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు, మహిళా కార్యవర్గ సభ్యులు ఏ.నాగదీప్తి, పి.కృష్ణకుమారి, ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షుడు సీహెచ్ శ్రీరామ్, కార్యదర్శి కె.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాలలో బుధవారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధుల కోసం లిపిని కనిపెట్టి వారి జీవితాలలో నూతన వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి బ్రెయిలీ అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మహిళా ప్రతినిధులు

పాయకాపురం(విజయవాడరూరల్): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తోందని జిల్లా ఇండస్ట్రీ సెంటర్ జనరల్ మేనేజర్ వీర శేఖర్ తెలిపారు. ఎంఎస్ఎంఈ–డీఎఫ్ఓ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ, విశాఖపట్నం కన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్(సీఓడబ్ల్యూఈ) కోవె వారి సౌజన్యంతో 30 రోజుల ఎంట్రప్రెన్యూర్షిప్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, అడ్వాన్స్డ్ ఫ్యాషన్ డిజైనింగ్ టెక్నాలజీ బుధవారం కండ్రిక వద్ద ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీర శేఖర్ మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు ప్రవేశపెట్టిన పథకాలను, జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్‌లో అమలు అవుతున్న పథకాలను వివరించారు. కోవె ప్రెసిడెంట్ రాధిక 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎంప్లాయీమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ)ను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చంద్రమౌళి భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల గురించి వివరించారు. ట్రైనర్ ఎస్.హర్షిణి తదితరులు పాల్గొన్నారు.

మురిపించెన్



చిట్టినగర్‌లో షేక్ ఖాదర్‌కు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ పిల్లా రాధా



కళానగర్‌లో మానసిక దివ్యాంగురాలు కనకదుర్గకు పింఛన్‌ను ఇస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ సుబ్బారావు



విజయవాడ రూరల్‌లో కాంతమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని భవానీపురం ఎస్ఐ బి.అనూష చెప్పారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం మత్తు పదార్థాలు – సోషల్ మీడియ దుర్వినియోగం అనే అంశంపై మహిళా సంరక్షణ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్న విద్యార్థులు, యువతను కాపాడుకోవల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కావడానికి సామాజికపరంగా అనేక కారణాలు ఉన్నాయని, వాటిల్లో తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలు పిల్లలతో ఎక్కువ సమయం గడపకపోవడం ఒకటన్నారు. అందమైన జీవితాన్ని మత్తుతో దుర్భరం చేసుకోవద్దని యువతకు సూచించారు. ఇలాంటి వారిని గుర్తించి నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడు మండలం పోలసానపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బోస్కో డీ–ఎడిక్షన్ సెంటర్‌కు తరలించి వారికి చికిత్స అందించడం ద్వారా మత్తు ప్రపంచంలో నుంచి బయటకు తీసుకురావటానికి మహిళా పోలీసులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ షీలా నికోలస్, జి.అనూష, జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక, హెడ్ కానిస్టేబుల్ పి.వరలక్ష్మి, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో వర్క్‌షాప్..

వించిపేట(విజయవాడపశ్చిమ): నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో 49వ డివిజన్ టైలర్‌పేటలోని సచివాలయంలో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై సిబ్బందికి వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిసలైన విద్యార్థులు, యువతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో కాపాడాలి అన్నారు. ఇటీవల కాలంలో ఎక్కువగా విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలై పోతున్నారని, దానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. అనంతరం సామాజిక మాధ్యమాలు ఉపయోగాలు, నష్టాలను వివరించారు. చాలమందిలో ఒంటరితనం, వత్తిడికి సోషల్ మీడియా కారణం అవుతుందన్నారు. దీని ద్వారా నిద్రలేమితో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. అటువంటి వారికి కౌన్సెలింగ్, మెడిసిన్ అవసరమని చెప్పారు. వీరి కోసం పొలసనపల్లి గ్రామంలో బోస్కో డీ–ఎడిక్షన్ సెంటర్, మానసిక సమస్యలకు విజయవాడలో 'నీ తోడు మానసిక వికాస కేంద్రం' ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైన వారు 94904 92020 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ కె.వి ఘ్నేశ్వరరావు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, బి.భార్గవి, ఆసిఫా, ఆరోగ్య సిబ్బంది రత్నకుమారి, నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ మమత, వసంత కుమారి పాల్గొన్నారు.



మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎస్ఐ అనూష

చురుగ్గా మినీ రైతుబజార్ నిర్మాణ పనులు

- రూ.24 లక్షల నిధులు మంజూరు
- చివరి దశకు చేరిన పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం గుప్తా సెంటర్‌లో మినీ రైతుబజార్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇందు కోసం నగర పాలక సంస్థ మంజూరు చేసిన రూ.24 లక్షలతో పనులు చివరి దశకు చేరాయి. మారయ్య హోటల్ సెంటర్ నుంచి వంగవీటి మోహనరంగా జంక్షన్‌కు వెళ్లే అంబేడ్కర్ రోడ్ పక్కనే నిర్మిస్తున్న ఈ భవనం ముందుభాగాన మూడు షాపులు, వెనుక భాగంలో రైతుబజార్ ఏర్పాటుకు పెద్ద హాల్ కేటాయించారు. ఈ హాల్‌ను ప్లాట్‌ఫాంలుగా విభజించి కూరగాయలు విక్రయించుకునేలా రూపొందిస్తున్నారు. నూతన భవనాన్ని నిర్మిస్తున్న స్థలంలో గతంలో కొండ ప్రాంతంలో నివసించే ప్రజలు వినియోగించుకునేందుకు పబ్లిక్ టాయిలెట్స్ ఉండేవి. అయితే ప్రస్తుతం కొండ ప్రాంతంలో కూడా ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకోవడంతో పబ్లిక్ టాయిలెట్స్ గత కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో నగరపాలక సంస్థ అధికారులు వాటిని తొలగించి ప్రజాప్రయోజనాల దృష్ట్యా రైతుబజార్ ఏర్పాటు చేసేందుకు భవనాన్ని నిర్మిస్తున్నారు.



గుప్తా సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న రైతుబజార్ భవనం

రైతుబజార్‌తో ప్రజలకు ఉపయోగం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సహకారంతో తమ డివిజన్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ తెలిపారు. డివిజన్ పరిధిలో సుమారు ఎనిమిది దశాబ్దాల కిందట నిర్మించిన దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్ భవనాన్ని తొలగించి రూ.3 కోట్ల వ్యయంతో స్కూల్‌కు నూతన భవనం నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామన్నారు. అలాగే ఇక్కడ ఏర్పాటు చేస్తున్న రైతుబజార్ విద్యాధరపురం ప్రాంతవాసులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు.

దాతృత్వం చాటుకున్న పోలీసులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు సహాయం అందిస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులు మరోమారు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రావణి తండ్రిని కోల్పోయింది. తల్లి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో శ్రావణికి బీఫార్మసీలో సీటు వచ్చిన నేపథ్యంలో మొదటి సంవత్సరం కాలేజీ ఫీజు కట్టేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో పోలీసు సిబ్బంది నిర్వహించే దీవెన ఫౌండేషన్ గురించి తెలుసుకున్న ఆమె వారిని సంప్రదించింది. వెంటనే స్పందించిన వారు బుధవారం ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును ఆయన చాంబర్‌లో కలుసుకుని ఆయన చేతుల మీదుగా శ్రావణికి 15 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ బ్రహ్మం, శరత్ కుమార్, గోపిచంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ పేదలకు సాయం చేయడంలో దీవెన ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.



శ్రావణికి నగదు అందచేస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

సిబ్బంది సమయపాలన పాటించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె బుధవారం తన ఛాంబర్‌లో కార్యాలయ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఫ్ఆర్ఎస్ అమలు, కార్యాలయం పరిపాలన పరమైన వ్యవహారాలు, బాధ్యతలు, సిబ్బంది సమయపాలన, క్రమశిక్షణ వంటి అంశాలపై సమీక్షించి తగు ఆదేశాలిచ్చారు. అదే విధంగా ఫైల్స్ క్లియరెన్స్, పని నాణ్యత వంటి అంశాలపై కూడా సమీక్షించారు. కార్యక్రమంలో గణాంక అధికారి ఎస్.లక్ష్మోజీ, సూపరింటెండెంట్ వి.శ్రీనివాసరావు, డెప్యూటీ గణాంక అధికారి బి.గోపాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్‌లు సీతాకళ్యాణి, ప్రసూనాంబ, కె.వాసు, ఆనందరావు, 104 జిల్లా సమన్వయ అధికారి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యంపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు భవానీపురానికి చెందిన దుర్గాభవానీ, దుర్గాప్రసాద్ దంపతులు, వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. దుర్గాప్రసాద్ ఎండీయూ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దుర్గాభవానీ కొంత కాలం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేసి ఇంటి వద్దనే ఉంటుంది. మంగళవారం ఉదయం ఆమె భర్త డ్యూటీకి, పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. దుర్గాప్రసాద్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేసరికి తాళం వేసి ఉంది. భార్యకు ఫోన్ చేయగా ఒక్కసారి రింగ్ అయ్యి, వెంటనే స్విచాఫ్ అని వచ్చింది. ఇంటి తాళం తీసి చూడగా ఆమె బట్టలు, సర్టిఫికెట్స్ బ్యాగ్ కనిపించలేదు. అనుమానం వచ్చి చుట్టుపక్కల వారిని ఆరాతీశాడు. ఉదయం 10.30 గంటల సమయంలో బ్యాగ్ తీసుకుని వెళ్లడం చూశామని కొందరు చెప్పారు. దీంతో దుర్గాభవానీ తల్లికి సమాచారం అందించారు. ఆమె తన కుమార్తె కనిపించడం లేదంటూ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో జనవరి 7వ తేదీ నుంచి వివిధ అంశాల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీ కేర్ అసిస్టెంట్, జ్యూట్ క్రాఫ్ట్ ప్రొడక్ట్స్ మేకర్, అసిస్టెంట్ ప్లంబింగ్ శానిటరీ వర్క్, అసిస్టెంట్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ, కట్టింగ్ అండ్ టైలరింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ రిపేర్, హోమ్ క్రాఫ్ట్స్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ అంశాల్లో శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866-2470420 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో విజేతకు అభినందన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): గత నెల 24, 25 తేదీల్లో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లోని ఖాన్‌దుబాయ్ సేనైహాల్‌లో జరిగిన 37వ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి రజత పతకం సాధించాడని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మండవ సాంబశివరావు తెలిపారు. కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ సీఈసీ చదువుతున్న టి.ప్రవీణ్ అండర్–18 బాలుర విభాగంలో 70 కేజీల వెయిట్ సామర్థ్యంలో సెల్ఫ్ డిఫెన్స్ విభాగంలో రజత పతకం సాధించాడన్నారు. ప్రవీణ్‌ను కళాశాల వ్యాయామ అధ్యాపకుడు కె.మార్కండేయులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



రజత పతకం పొందిన ప్రవీణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సాంబశివరావు

నేడు జైనుల మౌన ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలోని వివిధ ప్రాంతాల్లో జైనుల పుణ్యక్షేత్రాల రక్షణ కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం మౌన ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు విజయవాడ జైన్ సంఘ్ కన్వీనర్ పన్నాలాల్‌జైన్ చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఆ సంఘ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. దేశంలో జైనులు మైనార్టీలుగా ఉన్నారన్నారు. తక్కువ సంఖ్యలో ఉన్న తమకు, తమ పుణ్యక్షేత్రాలను కాపాడేందుకు, రక్షణ కల్పించేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఉదయం తొమ్మిది గంటలకు మౌన ప్రదర్శనలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా జైనుల అత్యంత పవిత్రమైన తీర్థ క్షేత్రమైన గుజరాత్‌లోని శ్రీ శత్రుంజయ తీర్థంపై ఇటీవల కొంతమంది దుండగులు దాడి చేసి అక్కడ భగవంతుని పాదాలను ధ్వంసం చేశారన్నారు. అలాగే జార్ఖండ్‌లోని శిఖర్జీ తీర్థ ప్రదేశానికి పర్యాటక కేంద్రంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జైనులు పూర్తి శాఖాహారాన్ని పాటించటమే కాకుండా అనేక కఠిన నియమాలను ఆచరిస్తూ జీవితాలను కొనసాగిస్తారన్నారు. అటువంటి జైన పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించటం వలన జైనుల సిద్ధాంతాలకు విరుద్ధంగా అక్కడి కార్యకలాపాలు జరిగే ప్రమాదముందన్నారు. దీనిని యావత్ జైన సమాజం వ్యతిరేకిస్తుందన్నారు. తక్షణం జార్ఖండ్ ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చే నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. వీటిపై దేశ వ్యాప్తంగా జైనులు నిరసనలు తెలియజేసి ప్రభుత్వానికి తమ విన్నపాలను వివరించాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా విజయవాడలో మౌనప్రదర్శనగా వెళ్లి కలెక్టర్‌ను, గవర్నర్‌ను కలిసి వినతిపత్రాలను అందిస్తామని చెప్పారు. సమావేశంలో జైన సమాజ్ నాయకులు మనోజ్ కొఠారి, అశోక్‌జైన్, భోగిలాల్‌జైన్, సందీప్‌కాన్కరియా, సంజయ్‌జైన్, రాజు జైన్, మహేంద్రజైన్, ప్రవీణ్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పన్నాలాల్‌జైన్ తదితరులు

విద్యార్థుల అభ్యున్నతికి అండగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రులు సైతం అండగా ఉండాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు చెప్పారు. కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో పేరెంట్స్ మీట్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ.. విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో తల్లిదండ్రులు సైతం తోడ్పాటునందించాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆయా రంగాల్లో వస్తున్న మార్పులను తెలియజేసేందుకు కళాశాల విభాగాలు పలు కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోందని చెప్పారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసేలా చూడాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన తదితర అంశాల్లో నిర్దిష్టంగా వ్యవహరించాలని చెప్పారు. అదేవిధంగా విద్యార్థులు డిగ్రీతో పాటుగా ఉద్యోగావకాశాలను సైతం అందించేందుకు తమ కళాశాల నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ కృష్ణవేణి, కేపీటీ విజయ భాస్కర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరావు



వన్‌టౌన్ వాగు సెంటర్‌లో బియ్యం తీసుకుంటున్న రేషన్ కార్డుదారులు

● కొనసాగుతున్న రేషన్ పంపిణీ

విజయవాడ నగరంలో రేషన్ పంపిణీ కొనసాగుతోంది. ఎండీయూ వాహనదారులు ఇంటింటికీ వెళ్లి రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు రేషన్ అందించనున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నగరాల సంక్షేమానికి కృషి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని నగరాల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాయన బాబూజీ(బాబ్జీ) అన్నారు. ఏపీ నగరాల సంఘం కార్యవర్గ సమావేశంలో సంఘం ముద్రించిన క్యాలెండర్‌ను బుధవారం సాయంత్రం ఆ సంఘ కార్యాలయంలో బాబూజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాల అభ్యున్నతికి ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. నగరాల సంఘానికి చెందిన పలువురికి ప్రభుత్వం పదవులు కేటాయించటంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతిన వేంకటేశ్వరస్వామి, కార్యవర్గ ప్రముఖులు బేవర సూర్యనారాయణ, ఈది సాంబశివరావు, ఉట్ల నాగేశ్వరరావు, దుమ్మెద వెంకటేశ్వరరావు, రాంపిళ్ల గురునాథరావు, పిళ్లా మోహనరావు, పైలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బాబూజీ, నాయకులు